క్లుప్తంగా

ఆదికవి వాల్మీకి సాహిత్య సేవలు ఎనలేనివి



భీమడోలులో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండే సుధాకర్, విద్యార్థులు

భీమడోలు: ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిన రామాయణాన్ని రాసిన ఆది కవి వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు ఆదేశాల మేరకు భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో మహర్షి వాల్మీకి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, కడగల సత్యనారాయణ, విద్యార్థులు, పాల్గొన్నారు.

వాల్మీకి జయంత్యుత్సవం

పెదపాడు: వాల్మీకి జయంతిని పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్, కార్యదర్శులు పీవీ రమణ, వినోద్, మేకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ



ఉంగుటూరులో ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ అల్లాడి రమణ

ఉంగుటూరు: ధాన్యం కొనుగోలుపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ అల్లాడి వెంకటరమణ సిబ్బందికి సూచించారు. శనివారం ఉంగుటూరులో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై వీఏఏ, వీఆర్వో, సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ధాన్యంలో తేమ శాతం, మద్దతు ధర, తేమ యంత్రం పనిచేసే విధానం, తేమ శాతం కొలిచే పద్ధతి, గోనె సంచుల పంపిణీ, రవాణా ఖర్చులు తదితర వివరాలను సిబ్బందికి వివరించారు. బాదంపూడి, బొమ్మిడి, నారాయణపురం సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గణపవరం విద్యార్థులు

గణపవరం: గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మూర్తి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2023–24 పోటీల్లో అండర్ –14, అండర్– 17 విభాగాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది బాలురు, ఎనిమిది మంది బాలికలు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకూ తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన పీడీ పద్మావతిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడులు నిర్వహించిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డికి అందిన సమాచారం మేరకు పెదవేగి మండలం జానం పేటలో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,340 నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు వ్యక్తులపై తదుపరి చర్యల కోసం పెదవేగి పోలీస్‌స్టేషన్ ఎస్సైకి స్వాధీనం చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి శివలింగాల తయారీ



దెందులూరు నర్సింగ్ కళాశాలలో మట్టి శివలింగాలు తయారు చేస్తున్న భక్తులు

దెందులూరు: దెందులూరులో రామదండు ఆధ్వర్యంలో బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో 5 లక్షల మట్టి చిన్న శివలింగాల తయారీ కార్యక్రమాన్ని కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు, డైరెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మొటపర్తి రాజా శనివారం ప్రారంభించారు. దెందులూరులోని భక్తులు పాల్గొని ఒక్కరోజులో 40 వేల శివలింగాలను తయారు చేశారు. నవంబర్ 2 వరకు శివలింగాలు తయారు చేస్తామన్నారు. తయారు చేసిన చిన్న శివలింగాలను కాశీకి పంపిస్తామని, కార్తీక పౌర్ణమి రోజున రామదండు ఆధ్వర్యంలో కాశీలో గంగతో వాటికి అభిషేకం చేస్తామని వివరించారు.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- చిలకంపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చిలకంపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: రైతుల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రథమ ప్రాధాన్యత అని, ఈ విషయం నాలుగున్నరేళ్ల పాలనలో రుజువైందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం గణపవరం మండలం చిలకంపాడులో రైతుభరోసా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచ్ చుక్కా అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. రైతుల కాయకష్టంతో పండించిన ప్రతీ ధాన్యం గింజనూ మద్దతుధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రైతులకు ధాన్యం సొమ్ము చెల్లింపులో ఆలశ్యం లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయడంతో రైతుకు ఎకరాకు రూ.ఐదువేలకు పైగా ఆదాయం వస్తోందన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతల అవసరాలను తీరుస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే పరిహారాన్ని త్వరితగతిన అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు, ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియంను భరించి, రైతులను ఆదుకుంటుందన్నారు. గతేడాదికన్నా ఈఏడాది ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు రూ.143 పెంచిన విషయాన్ని రైతులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, సివిల్ సప్లయీస్ డీఎం శివరాంప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డీఎస్‌వో సరోజని, ఆర్డీవో శ్రీనివాసులరాజు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, ఉపసర్పంచ్ పూసల వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోరుపోలు అప్పారావు, ఏవో యర్రంశెట్టి ప్రసాద్, ఏడీఏ మురళీకృష్ణ, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు



భీమడోలులో మాట్లాడుతున్న ఏడీఏ ఉషారాజకుమారి, పసుపులేటి సత్యనారాయణ

భీమడోలు: ఈ పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి అన్నారు. 2023–24 సార్వా సీజన్ పూర్తయిన నేపథ్యంలో భీమడోలు, కురెళ్లగూడెం, అంబర్‌పేట, పూళ్ల, పోలసానిపల్లి గ్రామాల్లో రైతుల జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. భీమడోలులో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధరతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయన్నారు. ఆర్‌బీకేల్లో ఉన్న రైతులకు సంబంధించిన వివరాల్లో తప్పులుంటే గ్రామసభల్లో ఫిర్యాదు చేయాలన్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని 44,111 ఎకరాల్లో రైతులు పండించిన పంట వివరాలతోపాటు అంశాలపై రూపొందించిన జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శించామన్నారు. మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభలను పూర్తి చేసామన్నారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదైన వివరాలు పరిశీలించి సవరణ కోసం సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, వీఏఏలు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదుపై గ్రామ సభలు

దెందులూరు: రైతులు అన్ని గ్రామాల్లో ఆర్‌బీకేల్లో పొందుపరిచిన ఈ–పంట నమోదు జాబితాను పరిశీలించాలని మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. శనివారం దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు అధ్యక్షతన ఈ–పంట రైతుల జాబితాను సమావేశంలో మండల వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఛార్జీలను చెల్లించి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ–పంట నమోదు జాబితాను సరిచూసుకుని ఆదివారం లోపు అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు.

పశువులకు వైద్య పరీక్షలు



గొల్లగూడెంలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ఉంగుటూరు: పశువులకు సోకే వ్యాధులపై రైతులు అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని పశువైద్య అధికారి కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ కరపా వెంకట శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు మినరల్ మిక్చర్‌ను దాణాలో కలిపి ఇవ్వాలని రైతులకు సూచించారు. ఈ శిబిరంలో 580 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పాడి రైతులకు మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ కార్యదర్శి రాజారావు, గోద్రెజ్ జనరల్ మేనేజర్ హేమ కొండలరావు, రైతు నాయకులు పాల్గొన్నారు.

పెదవేగి ఇన్‌చార్జి సీఐగా బాలసురేష్

దెందులూరు: పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూజివీడు సీఐ బాల సురేష్‌ను ఇన్‌చార్జి సీఐగా, దెందులూరు ఎస్సైగా పెదపాడు ఎస్సై చల్లా కృష్ణను ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారని నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న పెదవేగి సీఐ, దెందులూరు ఎస్సైలను వీఆర్‌లకు పంపిన సంగతి విదితమే. వారి స్థానాల్లో ఇన్‌చార్జి సీఐ, ఎస్సైలను నియమించారు.

దుర్గమ్మ ఆలయానికి వాటర్ ఫిల్టర్ వితరణ

దెందులూరు: గోపన్నపాలెంలో కనకదుర్గమ్మ ఆలయానికి కొండేటి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను శనివారం అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు సురక్షితమైన మంచినీరు అందించాలన్న సంకల్పంతో ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్టు దాత కొండేటి హనుమంతు వివరించారు. దాతను నూతన ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు అభినందించారు.

పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం



భీమడోలులో వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: పోలీస్ అమర వీరులను సంస్మరించుకోవడం మన విధి అని, వారి సేవలను చిరస్మరణీయమని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని భీమడోలు రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయిలో లైంగిక వేధింపులు, మహిళల భద్రత అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో విజేతలను జిల్లాస్థాయికి పంపిస్తామన్నారు. తొలుత ఎస్సై చావా సురేష్‌కుమార్ బాలికలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యం పదిలం



ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యం పదిలమని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. శనివారం పెదవేగి మండలంలోని రాయన్నపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పర్వతనేని రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతనేని రమాదేవి, ఎంపీటీసీ మట్టా రాగిణి, విజయరాయి సొసైటీ చైర్‌పర్సన్ పాలడుగు పెదబాబు, ఉపసర్పంచ్ పులపాక గాంధీ, ఎంఈఓ2 అరుణ్ కుమార్, స్థానిక నాయకులు, చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, పర్వతనేని నారాణేశ్వర్ పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని పలువురు అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం రావులపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో 425 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 100 మందికి కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. డాక్టర్ సంతోష్ (జనరల్ సర్జరీ), శివశంకర్ (పల్మనాలజిస్ట్), డా.మానస, డా. వర్మ వైద్య సేవలందించారు.

వాసవీ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



వాసవీ ట్రస్టు సభ్యులకు విరాళం అందజేస్తున్న దృశ్యం

పెదపాడు: ఏపూరు గ్రామంలోని వాసవీ సేవా ట్రస్టుకు గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ ప్రకటించిన రూ.5 లక్షలను విరాళంగా అందించారు. ఏపూరులోని వాసవీ కల్యాణ మండలంలో ఎమ్మెల్యే సహచరుడు ఓలుపల్లి రంగా చేతుల మీదుగా శనివారం ట్రస్టు సభ్యులకు నగదు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆర్యవైశ్య మహాసభ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పైడి సుధాకర్, పర్యవేక్షణలో వాసవీ సేవా ట్రస్టు ప్రెసిడెంట్ చామర్తి రాంబాబు, కొనకళ్ల వెంకటేశ్వరరావు, తవ్వా పూర్ణ, రాంబాబు, మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ కంభంపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రగతి అంచనా పరీక్షపై శిక్షణ

గణపవరం: విద్యావ్యవస్థలో లోటుపాట్లు గమనించి విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న రాష్ట్ర విద్యాప్రగతి అంచనా పరీక్షపై శనివారం డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపికచేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈపరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని మండలాల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించారు. వీరికి పరీక్ష నిర్వహణపై ఎంఈవో శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. నవంబర్ 2న ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లి పరీక్ష సంసిద్ధతను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ టి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ లక్ష్మికి సత్కారం

దెందులూరు: దెందులూరు ఎంపీడీఓగా పనిచేస్తూ డీఎల్‌పీఓగా పదోన్నతి పొందిన ఏబీపీపీ లక్ష్మిని శనివారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో దెందులూరు మండల డిజిటల్ అసిస్టెంట్లు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందాలని, ఎంపీడీఓగా తమను ప్రోత్సహించి సహాయ సహకారాలు అందించినందుకు డిజిటల్ అసిస్టెంట్లు డీఎల్‌పీఓకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీపై గ్రామ సభలు

దెందులూరు: గ్రామాల్లో ప్రజలకు అత్యవసరంగా ఉపయోగపడే పనులను ఎంపిక చేసి జాతీయ ఉపాధి హామీ పథకం నిబంధనలకు అనుగుణంగా కూలీలకు ఉపాధి కల్పిస్తామని ఉపాధి హామీ దెందులూరు మండల ఏపీఓ దశరదరామ్‌జీ అన్నారు. సీతంపేటలో సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు, రామారావుగూడెంలో సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ అధ్యక్షతన, దోసపాడులో టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్ ఆధ్వర్యంలో ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల్లో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు ఎంపిక చేసే విధానం, ఉపాధి కూలీల హక్కులను ఏపీఓ వివరించారు. మూడు గ్రామాల్లో ఉపాధి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెదపాడు: మధ్యాహ్న భోజనం తయారు చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెదపాడు మండల తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్ స్థానిక ఉపాధ్యాయులకు సూచించారు. పెదపాడు మండలం గోగుంట మండల పరిషత్ పాఠశాలలో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. కూరగాయలు, ఆకు కూరలు పాఠశాల ఆవరణలోనే పెంచడంపై ఉపాధ్యాయుడు జేమ్స్‌ను అభినందించారు. ఈ తనిఖీల్లో ఎంఈఓలు సబ్బితి నర్సింహామూర్తి, డీవీ రమణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థల పట్టాల పంపిణీ

ఏలూరు రూరల్: దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. శనివారం మరడాని రంగారావు కాలనీలో ఆయన పలువురు పేదలకు ఇళ్ల స్థల పట్టాలను పంపిణీ చేశారు.

శ్రీరామవరం– సీతంపేట రహదారి అభివృద్ధి



రూ.1.47 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన శ్రీరామవరం- సీతంపేట రహదారి

దెందులూరు: దశాబ్దాల కాలంగా వేలాది మంది రైతులు, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న శ్రీరామవరం– సీతంపేట నాలుగు కిలోమీటర్ల రోడ్డు ఎట్టకేలకు మోక్షం లభించింది. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి 8 గ్రామాల రైతులు, ప్రజలు, రైతువారీ, సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.1.47 కోట్ల నిధులను మంజూరు చేయించారు. జాతీయ రహదారి సీతంపేట నుంచి శ్రీరామవరం క్రాస్ రోడ్డు వరకు నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డును పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయించారు. 8 గ్రామాల్లో రైతులు, ప్రజలు వాహనదారులు దశాబ్దాలుగా పడుతున్న కష్టాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో తొలగిపోయాయని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆయా గ్రామాల ప్రజల తరఫున ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సీతంపేట ప్రజా ప్రతినిధులు నూతనంగా నిర్మించిన రోడ్డును వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత కనకరాజు, పార్టీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణిసుధీర్, చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, మేధినరావుపాలెం సర్పంచ్ మనుబోలు దుర్గాకుమారి రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, సానిగూడెం సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), నాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



గుండుగొలనులో ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కనకదుర్గమ్మ వారి ఊరేగింపులు, భారీ అన్న సమారాధనలు ఘనంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గుండుగొలనులోని ఒకటో వార్డులో ప్రతిష్ఠించిన అమ్మవారి భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. డీజే సౌండ్స్, మేళతాళాల నడుమ శక్తి వేషాలు, బుట్టబొమ్మలు, విచిత్ర వేషధారణలతో నృత్యం చేస్తూ కళాకారులు అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి విశేషంగా అలంకరించారు. అనంతరం గోదావరి కాల్వలో విగ్రహాన్ని నిమజ్జనం చేసారు. గ్రామంలోని సినిమా హాల్ వద్ద అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోధనలో స్మార్ట్ పరికరాలు వినియోగించాలి



బువ్వనపల్లి ప్రీహైస్కూల్లో ఐఎఫ్‌పీల వినియోగాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తోందని, ఉపాధ్యాయులు ఈ విషయంలో చిత్తశుద్ధితో పనిచేయాలని నిడమర్రు ఎంఈవో–2 కె.రాంబాబు అన్నారు. శనివారం ఆయన నిడమర్రు మండలం బువ్వనపల్లి ప్రీహైస్కూల్లో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానళ్లను వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకోసం ఆన్‌లైన్ ద్వారా నిపుణులతో రూపొందించిన పాఠ్యాంశాలను అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి రోజూ కొంత సమయం స్మార్ట్ పరికరాలనె వినియోగించి బోధించాలన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగం, బైజూస్ పాఠాలను బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్‌లు, రాత పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీ నారాయణదాసు, హెచ్ఎం సంకు ఏసుబాబు పాల్గొన్నారు.

అర్హులకు ఉచిత న్యాయ సేవలు

పెదపాడు: న్యాయ సేవాధికార సంస్థ అర్హులందరికీ ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే కే వీ బులికృష్ణ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ పురుషోత్తం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కేకేవీ బులికృష్ణ శనివారం గోగుంటలో వివాదరహిత గ్రామం అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ యస్ నర్సింహమూర్తి, ఎస్సై చల్లా కృష్ణ, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్బినేని విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు, గృహాలను వేగంగా పూర్తి చేయండి

పెదవేగి : ప్రభుత్వ భవనాలు, జగనన్న గృహ నిర్మాణాలు, నాడు– నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం శనివారం నిర్వహించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పనుల పురోగతిని ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఏఈపీఆర్ కృష్ణమోహన్, ఏఈఆర్‌డబ్ల్యుఎస్ శ్రీకాంత్, ఏఈ హౌసింగ్ నాగరాజు, ఎంఈఓ బుద్ధ వాస్, పాల్గొన్నారు.